సాక్షి
రాజన్న సిరిసిల్ల

గురువారం । 2 । ఫిబ్రవరి । 2023



చక్రతీర్థోత్సవం..
కరీంనగర్ మార్కెట్‌రోడ్ శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం చక్రతీర్థోత్సవం, వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు.



మత్స్యగిరీంద్రుని కల్యాణం
శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్ర స్వామి గుట్టపై బుధవారం భూదేవి, నీలాదేవితో స్వామివారి కల్యాణం కనులపండువగా, అంగరంగ వైభవంగా జరిగింది.

గరిష్ఠం/కనిష్ఠం
31.0/17.0

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పడప్పడు మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి బుధవారం తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు హాజరవుతారని వివరించారు.

26 మంది బాలకార్మికులకు విముక్తి



ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: రాజన్నసిరిసిల్ల జిల్లాలో జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించిన ఆపరేషన్‌స్మైల్–9తో 26 మంది బాలకార్మికులకు విముక్తి లభించిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ బుధవారం తెలిపారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఏడాదిలో రెండు సార్లు ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ చేపడుతున్నట్లు వివరించారు. జిల్లాలో ఈ కార్యక్రమం విజయవంతమయ్యేందుకు పోలీస్, టాస్క్‌ఫోర్స్ బృందం, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ, కార్మికశాఖ, విద్యాశాఖ, జిల్లా బాలల రక్షణ విభాగం, వివిధ శాఖల సమన్వయంతో ముందుకెళ్లినట్లు వివరించారు. 17 మంది బాలురు, 9 మంది బాలికలను వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చినట్లు వివరించారు. వీధి బాలలను చూస్తే డయల్ 100 , స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఆపరేషన్ స్మైల్ విజయవంతం చేయడానికి సహకరించిన అన్ని శాఖల అధికారులను ఎస్పీ అభినందించారు.

కంటి వెలుగులో 3,886 మందికి పరీక్షలు

సిరిసిల్లఅర్బన్: జిల్లావ్యాప్తంగా బుధవారం కంటి వెలుగులో 3,886 మందికి కంటిపరీక్షలు చేశారు. ఇందులో 717 మందికి రీడింగ్ అద్దాలు, 413 మందికి పాయింట్ గ్లాసులు అందించారు. జిల్లా వ్యాప్తంగా 27 క్యాంపుల్లో కంటివెలుగు నిర్వహించగా.. 243 మంది సిబ్బంది పాల్గొన్నారు.


స్పెల్‌బీలో రాష్ట్రస్థాయికి ఎంపిక



శ్రీనిధిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వెంకటపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని అల్లె శ్రీనిధి స్పెల్‌బీ కాంపిటీషన్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. శ్రీనిధిని బుధవారం ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు సన్మానించారు. పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతుల కోసం గోరుముద్ద కార్యక్రమాన్ని ప్రారంభించారు. రూ.16వేలు సేకరించి ప్రధానోపాధ్యాయునికి అందించారు. హెచ్‌ఎం శేఖర్, సర్పంచ్ కోల అంజమ్మ, ఎంపీటీసీ తిరుపతి, ఉపసర్పంచ్ బాలయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ కనకయ్య పాల్గొన్నారు.

పౌర సరఫరాల జిల్లా మేనేజర్‌గా జితేంద్రప్రసాద్



కలెక్టర్ అనురాగ్ జయంతిని కలిసిన జితేంద్రప్రసాద్

సిరిసిల్ల: జిల్లా పౌరసరఫరాల మేనేజర్ జితేంద్రప్రసాద్ బుధవారం విధుల్లో చేరారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన హరికృష్ణ దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్లగా కామారెడ్డి జిల్లా నుంచి జితేంద్రప్రసాద్ బదిలీపై వచ్చారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు.

జిల్లెల్ల చెక్‌పోస్టు ఎత్తివేత?

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులోని జిల్లా సరిహద్దు పోలీస్ చెక్‌పోస్టును బుధవారం ఎత్తివేశారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మంగళవారం తనిఖీ చేయగా.. మరుసటి రోజే జిల్లెల్ల చెక్‌పోస్టును ఎత్తివేయడం గమనార్హం. జిల్లా నుంచి అక్రమంగా ఇసుక రవాణా, పీడీఎస్ బియ్యం రవాణాను అడ్డుకునేందుకు గతంలో ఇక్కడ చెక్‌పోస్టును పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఉన్నట్టుండి చెక్‌పోస్టును ఎత్తివేయడం వెనక మతలబు ఏమిటో తెలియాల్సి ఉంది.

ఉమ్మడి జిల్లాకు నిరాశే

బసంత్‌నగర్ విమానాశ్రయంపై బడ్జెట్‌లో రాని స్పష్టత

- కరీంనగర్ ట్రిపుల్ ఐటీకైనా దొరకని హామీ
- ఆస్తిపన్ను విధింపుపై మిశ్రమ స్పందన
- ఈసారి కూడా నెరవేరని కేంద్రీయ, నవోదయ స్కూళ్లు
- నర్సింగ్ కాలేజీ కేటాయింపుల్లోనూ దక్కని అవకాశం



సాక్షి ప్రతినిధి, కరీంనగర్:
కేంద్ర బడ్జెట్ 2023-24 ఉమ్మడి జిల్లా ప్రజల ఆశలపై నీళ్లు చల్లింది. ఎలాంటి కేటాయింపులూ జరగలేదు. ముఖ్యంగా ఎయిర్‌పోర్టులు, జాతీయ రహదారుల్లో ఉమ్మడి జిల్లాకు కేటాయింపులు దాదాపుగా లేవనే చెప్పాలి. అదే సమయంలో సగటు ఉద్యోగిపై ఆదాయపు పన్ను విషయంలో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. కొందరు పన్ను విధానాన్ని ప్రశంసిస్తుంటే.. మరికొందరు విమర్శిస్తున్నారు.

- రాష్ట్ర విభజన హామీలకు సంబంధించి జిల్లాకు ఒకటి చొప్పున సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి నవోదయా స్కూళ్లు, కేంద్రీయ స్కూళ్లు ఇస్తానని మాట ఇచ్చిన కేంద్రం ఈసారి బడ్జెట్‌లోనూ ఎలాంటి హామీలు, కేటాయింపులు చేయలేదు. దీంతో ఈసారి కూడా తాజా బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు నిరాశే మిగిలింది.
- బడ్జెట్‌లో ఎంపిక చేసిన 50 విమానాశ్రయాల్లో తెలంగాణ నుంచి బసంత్‌నగర్ ఎయిర్‌పోర్టు ఉందా? లేదా అన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది. అయితే.. ఈ విషయంలో రాష్ట్రం ఎలాంటి ప్రతిపాదనలు పంపలేదని కేంద్రం మొదటి నుంచి చెబుతూ వస్తోంది.
- దేశవ్యాప్తంగా 174 నర్సింగ్ కాలేజీలను కేంద్రం మంజూరు చేసింది. ఇందులో మూడు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లగా తెలంగాణకు ఒక్క కాలేజీ కూడా మంజూరు కాలేదు. ఇటీవల ప్రతీ జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఇచ్చిన క్రమంలో నర్సింగ్‌కాలేజీలకు అనుమతి ఇచ్చి ఉంటే మరింత ప్రోత్సాహకరంగా ఉండేదని వైద్యనిపుణులు అభిప్రాయపడుతున్నారు.
- సగటు వేతనజీవికి ఆస్తిపన్ను విషయంలో మాత్రం మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. రూ.7 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడంపై కొందరు ప్రజలు స్వాగతిస్తున్నారు. అదే రూ.3 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు ఉన్న ఆదాయానికి 5% పన్నుపై మరికొందరు పెదవి విరుస్తున్నారు.
- మైనార్టీ బాలబాలికల స్కాలర్‌షిప్పుల రద్దుపై ముస్లిం నాయకులు మండిపడుతున్నారు. ఇది మైనార్టీ వ్యతిరేక ప్రభుత్వమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పన్నులో మెలిక..



ఆదాయం పన్ను పరిమితిని పెంచినట్లుగా చూపుతూనే మెలిక పెట్టింది. ఉద్యోగులకు నిరాశ కలిగిస్తుంది. ఆదాయపన్ను పరిమితిపై ఆంక్షలు సరికాదు.
– పాకాల శంకర్‌గౌడ్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

రాయితీలు తగ్గించారు



వ్యవసాయరంగానికి రాయితీలు తగ్గించారు. ఒక్క ప్రాజెక్టుకు జాతీయహోదా ఇవ్వలేదు. నేతన్నలకు జీఎస్‌టీ రాయితీ ప్రకటించలేదు. ఉపాధిహామీ పథకానికి రూ.29 వేల కోత విధించారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి నిధులు లేవు. ఎన్నికల బడ్జెట్. – ఆది శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు

మధ్యతరగతికి చేయూత



బడ్జెట్ మధ్యతరగతి ప్రజలకు చేయూతనిచ్చేలా ఉంది. పేదలు ఇళ్లు నిర్మించుకునేలా రూపొందించారు. మోదీ నాయకత్వంలో దేశ ప్రజలకు అనేక ఫలాలు అందుతున్నాయి.
– ప్రతాప రామకృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

రాష్ట్రానికి అన్యాయం



దేశంలో 157 నర్సింగ్ కళాశాలలు మంజూరు చేస్తే తెలంగాణకు ఒక్కటి లేదు. కర్ణాటకకు రూ.5,200 కోట్లు కరువు నిధులు కేటాయిస్తే మన రాష్ట్రానికి ఏమి లేదు. ఉపాధిహామీకి నిధులు తగ్గించడం బాధాకరం. బడ్జెట్‌లో అన్యాయం చేసింద్రు.
– తోట ఆగయ్య, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు

సర్వాంగ సుందరంగా వేములవాడ



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

- ఎమ్మెల్యే రమేశ్‌బాబు
- పలు అభివృద్ధి పనులకు భూమిపూజ

వేములవాడ: వేములవాడను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. వేములవాడలో పలు అభివృద్ధి పనులకు బుధవారం భూమిపూజ చేశారు. రూ.2.35కోట్లతో పాపన్నచౌక్ నుంచి భీమేశ్వరగార్డెన్ వరకు, పాపన్న చౌక్ నుంచి మల్లారం జంక్షన్ వరకు ఫుట్‌పాత్ పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు మాట్లాడుతూ బద్దిపోచమ్మ గుడి రెండు గుంటల్లో ఉంటే 39 గుంటలకు విస్తరించినట్లు పేర్కొన్నారు. రూ.20 కోట్ల టీయూఎఫ్‌ఐడీసీ నిధులలో రూ.13 కోట్ల పనులు పూర్తి చేశామని, మిగా పనులు సైతం త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. వారం రోజుల్లో మంత్రి కేటీఆర్ వేములవాడకు వచ్చి మూడు వేల మంది విద్యార్థులకు మినీకంప్యూటర్స్ అందజేస్తారని తెలిపారు. వేములవాడ పట్టణానికి చెందిన 800 మందికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందజేస్తామన్నారు. మున్సిపల్ పాలకవర్గం పనితీరు బాగుందని అభినందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, వైస్‌చైర్మన్ రాజేందర్, కమిషనర్ అన్వేశ్, సెస్ డైరెక్టర్ నామాల ఉమ పాల్గొన్నారు.

పేదలకు న్యాయం చేస్తాం

వేములవాడరూరల్: నియోజకవర్గంలోని పేదలకు న్యాయం చేస్తామని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. మన ఊరు–మన బడి కింద ఎంపికైన నాంపల్లి, చీర్లవంచ, మర్రిపల్లి పాఠశాలలను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలో 102 పాఠశాలలు ఎంపికయ్యాయని, వాటిలో మొదటి విడత పూర్తయిన పాఠశాలలను ప్రారంభించుకుంటున్నట్లు తెలిపారు. నాంపల్లిలో 49 మంది నిరుపేదలకు ప్రభుత్వం భూములు ఇచ్చిందని, కొందరు వాటిని స్వాధీనం చేసుకున్నారని, త్వరలోనే పూర్తి విచారణ చేపడతామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, జెడ్పీటీసీలు మ్యాకల రవి, ఏశ వాణి, సెస్ డైరెక్టర్లు నామాల ఉమ, ఆకుల దేవరాజం, కౌన్సిలర్లు నీలం కల్యాణి, జడల లక్ష్మి, నిమ్మశెట్టి విజయ్, సర్పంచ్ కట్కం మల్లేశం, ఎంపీడీవో రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం.. కమనీయం

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని కోరెంలో బుధవారం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు ఒడిబియ్యం పోశారు. సర్పంచ్ రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ మమత, వైద్యులు రవీందర్‌రావు, అమిత్‌కుమార్ పాల్గొన్నారు.

అనుభవాలే పాఠాలు..!

- విద్య, ఉద్యోగావకాశాలపై అవగాహన
- పూర్వవిద్యార్థులతో ఇంటరాక్షన్
- 'ఆలుమ్నిటాక్స్'లో భాగంగా అవగాహన సదస్సులు
- స్ఫూర్తిపొందుతున్న విద్యార్థులు

వేములవాడఅర్బన్: అనుభవాలు స్ఫూర్తినిస్తాయి.. పాఠ్యాంశాలు జ్ఞానాన్ని పెంపొందిస్తాయి. పెద్దల అనుభవాలను తెలుసుకొని.. వారి మార్గదర్శనంలో వెళ్తే ఉన్నత లక్ష్యాలు చేరుకోవడం కొంత వరకు సులువు అవుతుంది. దీనినే పాటిస్తున్నారు అగ్రహారంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది. కళాశాలలో చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డ వారితో 'ఆలుమ్ని టాక్స్' పేరిట అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈ సదస్సులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని విద్యార్థులు పేర్కొంటున్నారు.

1979లో కాలేజీ ప్రారంభం

రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం అగ్రహారంలో శ్రీరాజరాజేశ్వరస్వామి(ఎస్సారార్) ప్రభుత్వ పాటిటెక్నిక్ కళాశాలను 1979లో ప్రారంభించారు. 20 ఎకరాలలో కాలేజీ విస్తరించి ఉంది. ఈ కాలేజీలో చదివిన వారిలో చాలా మంది దేశవిదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. ఉన్నతంగా ఎదిగిన పూర్వ విద్యార్థులతో 'ఆలుమ్నిటాక్స్' పేరిట అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ బి.రాజగోపాల్ నిర్ణయించారు. ఇప్పటి వరకు నాలుగు సదస్సులు నిర్వహించారు.

పూర్వవిద్యార్థుల అనుభవాలు

కళాశాలలోని ఐదు విభాగాల్లో టాపర్లుగా నిలిచిన వారికి రూ.5వేలు ప్రోత్సాహక నగదు బహుమతి పూర్వ విద్యార్థులు అందిస్తున్నారు. కళాశాల వేదిక కోసం 2019 జూలై 11వ తేదీన 'ఆలుమ్ని టాక్స్'ను ప్రారంభించారు. మొదటి సదస్సుకు 2019లో కళాశాల సివిల్ పూర్వ విద్యార్థి బి.పర్శరాంగౌడ్ హాజరయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ గురించి విద్యార్థులకు వీడియో, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రెండో ఆలుమ్ని టాక్స్‌లో కళాశాలలో సీసీసీ విద్యార్థి బి.సురేశ్ డీసీసీపీ విద్యార్థులకు ఉపాధి అవకాశాల గురించి వివరించారు. మూడో ఆలుమ్నిటాక్స్ 2022లో నిర్వహించగా.. సివిల్ పూర్వవిద్యార్థి ఎన్‌ఆర్‌వి వెంకటరమణారావు సివిల్, ఎలక్ట్రికల్ విద్యార్థులకు కంప్యూటర్ రంగంలో ఉద్యోగావకాశాలు వివరించారు. నాలుగో ఆలుమ్నిటాక్స్‌లో భాగంగా 2023లో టెక్స్‌టైల్ పూర్వ విద్యార్థి సీహెచ్.గోవర్ధన్‌రావు టెక్స్‌టైల్ రంగంలో ఉపాధి అవకాశాల గురించి వివరించారు.



ఆలుమ్నిటాక్స్‌లో మాట్లాడుతున్న పూర్వ విద్యార్థి వెంకటరమణారావు (ఫైల్)

పట్టుదలతో ముందుకు..



కళాశాలలో నిర్వహిస్తున్న అలుమ్ని టాక్స్‌లో పూర్వ విద్యార్థులు తమ అనుభవాలు చెప్పడం బాగుంది. ఉద్యోగం ఎలా సంపాదించాలనే విషయాలు తెలియజేస్తున్నారు.
– భవాని, విద్యార్థి అగ్రహారం

సివిల్ గొప్పతనం తెలుసుకున్నాం



మా కాలేజీలో చదివి.. ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డ వారు ఆలుమ్నిటాక్స్‌లో భాగంగా తమ అనుభవాలు పంచుకుంటున్నారు. సివిల్ ఇంజినీరింగ్‌లో ఉద్యోగావకాశాలు, ఎలా ముందుకెళ్లాలి.. అనే వివరాలు అవగాహన కల్పించారు.
– వర్షిణి. విద్యార్థిని అగ్రహారం

పూర్వ విద్యార్థుల అనుభవాలు..



దేశవిదేశాల్లో స్థిరపడ్డ కళాశాల పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను ఆలు మ్ని టాక్స్ ద్వారా వి ద్యార్థులకు వివరిస్తున్నా రు. ఈ కార్యక్రమం ద్వారా వి ద్యార్థులు ఎలా కష్టపడి చదవాలి, ఉద్యోగం ఎలా సాధించాలి... అనే విషయాలు తెలియజేస్తున్నారు.
– రాజగోపాల్, కళాశాల ప్రిన్సిపాల్

అర్హులకు పోడు పట్టాలు

- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలోని అర్హులకు పోడుభూముల పట్టాలు ఇవ్వాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం పోడుభూముల జిల్లా కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ డివిజనల్ స్థాయి కమిటీ సిఫారసు చేసిన అర్హులకు పోడుభూములపై హక్కుపత్రాలు ఇవ్వాలన్నారు. కమిటీ సభ్యులు జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, అదనపు కలెక్టర్‌లు సత్యప్రసాద్, ఖీమ్యానాయక్, ఇన్‌చార్జి డీఆర్వో శ్రీనివాస్‌రావు, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, జెడ్పీటీసీలు గుగులోతు కళావతి, చీటి లక్ష్మణ్‌రావు, డీఎఫ్‌వో బాలమణి, డీటీడీవో అంబాజీ పాల్గొన్నారు.

విద్యాప్రమాణాల మెరుగే లక్ష్యం

- గంభీరావుపేటలో కేజీ టు పీజీ క్యాంపస్ ప్రారంభం
- క్యాంపస్‌కు ప్రొఫెసర్ జయశంకర్ పేరు
- మంత్రి కేటీఆర్
- హాజరైన విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి



భవిత సెంటర్‌ను సందర్శించిన మంత్రులు



కేజీ టు పీజీ క్యాంపస్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు కేటీఆర్, సబితాఇంద్రారెడ్డి



సమావేశానికి హాజరైన విద్యార్థులు

గంభీరావుపేట(సిరిసిల్ల): రాష్ట్రంలో విద్యాప్రమాణాలు మెరుపరచడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు రాష్ట్ర ఐటీ, పురపాలక మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. గంభీరావుపేటలో ఏర్పాటు చేసిన కేజీ టు పీజీ క్యాంపస్‌ను బుధవారం విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. క్యాంపస్‌లో మోడ్రన్ లైబ్రరీ, స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణకేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కేజీ టు పీజీ ప్రాంగణానికి తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. అంతేకాకుండా క్యాంపస్‌లో జయశంకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు.

జిల్లాపై ప్రగతి నివేదికలు

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత జిల్లాలో ఏం జరిగిందో శాఖలవారీగా ప్రగతి నివేదికలు రూపొందించి.. ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. విద్యాశాఖలో జరిగిన ప్రగతిని విద్యాప్రగతి, వ్యవసాయ, వైద్యం, సాగునీరు, సంక్షేమం, విద్యుత్‌శాఖల ద్వారా జిల్లాలో జరిగిన ప్రగతిని ప్రజలకు నివేదికల రూపంలో అందించి ఆశీర్వాదం తీసుకుంటామని స్పష్టం చేశారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, విద్యాశాఖ కార్యదర్శి కరుణ, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, కలెక్టర్ అనురాగ్ జయంతి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర మౌళిక సదుపాయలశాఖ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, టెక్స్‌టైల్స్‌శాఖ చైర్మన్ గూడురు ప్రవీణ్, డీఈవో రాధాకిషన్, ఆర్‌బీఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, వైస్‌ఎంపీపీ లత, ఎంపీటీసీ భాగ్య, కాలేజీ ప్రిన్సిపాల్స్ దాసు, వెంకట్‌నాయక్ పాల్గొన్నారు.

సంకేత్‌కు ప్రశంసలు

కేజీ టు పీజీ ప్రాంగణం నిర్మాణం పనులను మొదటి నుంచి చివరి వరకు పర్యవేక్షించిన గివ్ తెలంగాణ ప్రతినిధి కొండూరు రవీందర్‌రావు తనయుడు సంకేత్‌రావును మంత్రి కేటీఆర్ ప్రశంసించారు. సభావేదికపైకి పిలిచి అభినందించి, అందరితో చప్పట్లు కొట్టించారు.

నేనెవరో మీకు తెలుసా ?

'నేనెవరో మీకు తెలుసా.. నన్ను గుర్తుపట్టారా..?' అని మంత్రి కేటీఆర్ విద్యార్థులను ప్రశ్నించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తూ ముచ్చటించారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉంటుందని ఆరా తీశారు. బాగుంటుందని విద్యార్థులు సమాధానమిచ్చారు. అంతకుముందు కేజీ టు పీజీ ప్రాంగణానికి అనుబంధంగా నిర్మించిన మోడ్రన్ లైబ్రరీని సందర్శించారు. పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీయువకులతో మాట్లాడారు. లైఫ్‌స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించి శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాన్ని ప్రారంభించారు. దివ్యాంగుల కోసం తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కేజీ టు పీజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మన ఊరు–మన బడి చిహ్నం దగ్గర అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఫొటోలు దిగారు.

క్లుప్తంగా

అరెస్టులు అప్రజాస్వామికం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లాలో మంత్రులు కేటీఆర్, సబితాఇంద్రారెడ్డి పర్యటనలు ఉన్నందున పోలీసులు బీజేపీ నాయకులను ముందస్తు అరెస్టు చేయడం అప్రజాస్వామికని బీజేపీ మండలాధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి విమర్శించారు. తిరుపతిరెడ్డితోపాటు మరికొంత మంది బీజేపీ నాయకులను ఎల్లారెడ్డిపేట పోలీసులు బుధవారం తెల్లవారుజామున అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రశ్నించేహక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందన్నారు. గణేశ్, జితేందర్, సాయికిరణ్, అనిల్, నరేశ్, తిరుపతి ఉన్నారు.

సిరిసిల్ల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా జయంత్



అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుల జయంత్‌కుమార్, పర్కాల ప్రవీణ్‌గౌడ్

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల ప్రెస్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఆకుల జయంత్‌కుమార్ ఎన్నికయ్యారు. బుధవారం నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా జయంత్, ప్రధాన కార్యదర్శిగా పర్కాల ప్రవీణ్‌గౌడ్, సహాయ కార్యదర్శిగా రాపెల్లి భాస్కర్, కోశాధికారిగా కాయితి మహేందర్, కార్యవర్గ సభ్యులుగా అన్సార్ అలీ, అల్లె రమేశ్, జాన దయానంద్, దాసరి శిరీష, నాయిని బాబుగౌడ్, జక్కని రమేశ్‌ను అత్యధిక మెజారిటీతో సభ్యులు ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా అతికం రఘువీర్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా తడుక విశ్వనాథం, కరుణాల భద్రాచలం, రాపెల్లి సంతోష్, మేడి కిషన్, ఇరుకుల్ల ప్రవీణ్‌కుమారు వ్యవహరించారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం మొర్రాయిపల్లెకు చెందిన రైతు దమ్మ లచ్చయ్య(55) పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు. లచ్చయ్య బుధవారం వ్యవసాయ పనుల కోసం పొలానికి వెళ్లాడు. మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నానని కూతురు సోనికి ఫోన్‌చేసి తెలిపాడు. దీంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో కనిపించాడు. హుటాహుటిన ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతిచెందాడు. అప్పుల బాధలు భరించలేక లచ్చయ్య ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. లచ్చయ్య మృతితో భార్య ఎల్లవ్వ, కూతురు సోని రోదనలు మిన్నంటాయి. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాటిచెట్టు పై నుంచి పడిన గీతకార్మికుడు

ముస్తాబాద్(సిరిసిల్ల): ఆవునూర్‌లో తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడు బండి రాములు(34) తీవ్రంగా గాయపడ్డారు. రోజు మాదిరిగానే బుధవారం సాయంత్రం కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కుతుండగా మోకు జారీ కింద పడిపోయాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ రాములును సిరిసిల్ల ఆస్పత్రికి తరలించారు.

గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసే వేదిక



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంత్రి గంగుల



మేయర్ సునీల్‌రావు బ్యాటింగ్, మంత్రి కీపింగ్



తలపడుతున్న జట్లు

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP
SPL
SAKSHI PREMIER LEAGUE
SUDHAKAR
PIPES AND FITTINGS
LEADER IN QUALITY AND TECHNOLOGY

- విద్యార్థులు, యువత క్రీడా రంగంలో రాణించాలి
- సాక్షి ప్రీమియర్ లీగ్ సీజన్–4ను ప్రారంభించిన మంత్రి గంగుల

కరీంనగర్‌స్పోర్ట్స్: గ్రామీణ ప్రాంతాల్లోని మెరికల్లాంటి క్రీడాకారులను వెలికి తీసేందుకు 'సాక్షి' ప్రీమియర్ లీగ్ ఒక వేదికలాంటిదని, 'సాక్షి' మీడియా చేస్తున్న ప్రయత్నం అద్వితీయమని రాష్ట్ర బీసీ సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ తిమ్మాపూర్‌లోని జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో, స్టేట్ స్పాన్సర్ సుధాకర్ పీవీసీ పైప్స్ సౌజన్యంతో నిర్వహించిన సాక్షి ప్రీమియర్ లీగ్ సీజన్ 4 పోటీలను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతోనే యువత, చిన్నారులు సన్మార్గాల్లో నడుస్తారన్నారు. యువత విద్యలోనే కాకుండా అన్నిరంగాల్లోనూ రాణించాలన్నారు. మేయర్ సునీల్ రావు, జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ సాగర్‌రావు మాట్లాడుతూ ఇలాంటి పోటీలు గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు సువర్ణావకాశమని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి, మేయర్ బ్యాటింగ్ చేసి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. అంతకుముందు ఉదయం జరిగిన పోటీలను జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు ప్రారంభించారు. కార్యక్రమంలో సుధాకర్ పైప్స్ ఏరియా మేనేజర్ షేక్ రఫీ, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, కార్పొరేటర్ ఎడ్ల అశోక్, కరీంనగర్ సాక్షి యూనిట్ బ్రాంచి మేనేజర్ వైద శ్రీనివాస్, బ్యూరో ఇన్‌చార్జి అనిల్, ఏడీవీటీ మేనేజర్ లక్ష్మీనారాయణ, సర్క్యులేషన్ మేనేజర్ మధుకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తొలి రోజు ఫలితాలు

జూనియర్స్ విభాగంలో జ్యోతిష్మతి డిప్లొమా కళాశాల, కరీంనగర్ జట్టు.. అల్ఫోర్స్ జూనియర్ కళాశాల, మంచిర్యాలపై గెలిచింది. ఎస్సారార్ జూనియర్ కళాశాల, మంచిర్యాల జట్టు.. కాకతీయ జూనియర్ కళాశాల, గోదావరిఖని జట్టుపై



వికెట్ తీసిన ఆనందంలో..

విజయం సాధించింది. సీనియర్స్ విభాగంలో వివేకానంద డిగ్రీ కళాశాల, కరీంనగర్ జట్టు వివేకానంద ఇంజనీరింగ్ కళాశాల, కరీంనగర్‌పై విజయం సాధించింది. జూనియర్స్ బ్యాటింగ్‌లో రిషి (అల్ఫోర్స్) 23 పరుగులు, ఫిరోజ్ (జ్యోతిష్మతి) 20 పరుగులు, హుస్రేయర్ (ఎస్సారార్) 19 పరుగులు చేసి అలరించారు. సీనియర్స్‌లో ఆదిల్ (వివేకానంద) 34 పరుగులు చేశారు. కాగా జూనియర్స్ విభాగంలో జ్యోతిష్మతి (కరీంనగర్), ఎస్సారార్ (మంచిర్యాల) జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి.

రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు

- తెలంగాణలో రోడ్లన్నీ కేంద్రమే వేయించింది
- మాజీ ఎమ్మెల్యే కటుకం మృత్యుంజయం



ప్రెస్‌మీట్లో మాట్లాడుతున్న మృత్యుంజయం

సిరిసిల్లటౌన్: బీఆర్‌ఎస్ సర్కారు రాష్ట్రాన్ని దోచుకుంటుందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు కటుకం మృత్యుంజయం విమర్శించారు. సిరిసిల్లలోని తన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. ఎనిమిదేళ్ల పాలనలో రాష్ట్ర సర్కారు వేయించిన ఒక్క రహదారి లేదన్నారు. రూ.1.04 లక్షల కోట్లతో జాతీయ, గ్రామీణ రహదారులు నరేంద్రమోదీ ప్రభుత్వం నిర్మించింది నిజం కాదా.. అని మంత్రి కేటీఆర్‌ను ప్రశ్నించారు. జీ–20 దేశాల్లో భారతదేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టిన ప్రధాని మోదీని విమర్శించే స్థాయి మంత్రి కేటీఆర్‌కు లేదన్నారు. రూ.700 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేజంక్షన్ అభివృద్ధి చేశారన్నారు. రూ.6,338కోట్లతో రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని అభివృద్ధి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సిరిసిల్ల మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బర్కం లక్ష్మీయాదవ్, నాయకులు రాజాసింగ్, కైలాష్, అంజన్న, కమలాకర్ పాల్గొన్నారు.

'మంత్రి కేటీఆర్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదు'



మాట్లాడుతున్న అందె సుభాశ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సిరిసిల్ల నియోజకవర్గం అభివృద్ధిపరంగా ముందుకు తీసుకెళ్తున్న మంత్రి కేటీఆర్‌ను బీజేపీ నాయకులు విమర్శిస్తే ఊరుకునేది లేదు అని బొప్పాపూర్ ఏఎంసీ మాజీ చైర్మన్ అందె సుభాశ్ హెచ్చరించారు. ఎల్లారెడ్డిపేటలోని జెడ్పీటీసీ ఆఫీస్‌లో బుధవారం మాట్లాడారు. బీజేపీ నాయకులు మంత్రి కేటీఆర్‌పై ఇష్టానుసారంగా విమర్శలు చేయడం సరికాదన్నారు. మంత్రి కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గంలో అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌తో సిరిసిల్ల ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి జరుగలేదన్నారు. ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, మండల కోఆప్షన్ మెంబర్ జబ్బర్ ఉన్నారు.

అమ్మక్కపేట సబ్‌స్టేషన్‌కు పవర్ ట్రాన్స్‌ఫార్మర్



సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేస్తున్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్

కోరుట్ల: ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేట సబ్‌స్టేషన్‌కు రూ.50లక్షలతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేశారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు తెలిపారు. అమ్మక్కపేటలో సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయినా.. పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకపోవడంతో పలు సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొంటూ పలువురు ప్రజాప్రతినిధులు విద్యాసాగర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన.. ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావుకు ఫోన్ ద్వారా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు గురించి వివరించారు. ఆయన స్పందించి రూ.50లక్షలతో ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేశారు. ఆ వెంటనే సబ్‌స్టేషన్‌కు పంపించారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను త్వరలోనే బిగించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరుకు కృషి చేసిన రాష్ట్ర ప్రభుత్వం, టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావుకు విద్యాసాగర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

శిథిల భవనాలు కూల్చివేత



కూల్చివేత పనులు పరిశీలిస్తున్న అధికారులు

కథలాపూర్(వేములవాడ): పోతారం, కలిగోట గ్రామపంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో వాటిని కూల్చివేయించినట్లు డీఎల్పీవో శంకర్ పేర్కొన్నారు. బుధవారం రెండు గ్రామాల్లో పర్యటించి గ్రామపంచాయతీ భవనాలు పరిశీలించారు. ఇక్కడ భవన నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.20 లక్షల చొప్పున మంజూరు చేసిందన్నారు. పాతవి కూల్చివేసి కొత్తవి నిర్మించాలని నిర్ణయించామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జనార్దన్, ఎంపీవో గంగాధర్, ఏఈ ఆదిత్య, సర్పంచ్ ధర్మపురి జలందర్, ఉపసర్పంచ్ లత, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలంలోని గోదావరి నదీ తీరం నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం కొల్వాయి గ్రామశివారులో పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. తుంగూర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని, డ్రైవర్ పల్లపు రమేశ్‌పై కేసు నమోదు చేశామన్నారు. ట్రాక్టర్‌ను జప్తు చేసి పోలీస్‌స్టేషన్ తరలించినట్లు ఎస్సై వివరించారు.

శివాలయానికి పునర్వైభవం

- 400 ఏళ్ల చరిత్ర గల శివాలయ జీర్ణోద్ధరణ
- నేటి నుంచి మూడు రోజులు ఉత్సవాలు



ముస్తాబైన శివాలయం



శివలింగం

ముస్తాబాద్(సిరిసిల్ల): గతమెంతో ఘనం.. 400 ఏళ్ల చరిత్రకు సాక్షిగా నిలుస్తున్న మెట్టు శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయం జీర్ణోద్ధరణకు శ్రీకారంచుట్టారు. శిథిలావస్థకు చేరుకున్న ఆలయాన్ని పునర్ నిర్మించారు. విగ్రహాల పునర్ ప్రతిష్ఠ వేడుకలను గురువారం నుంచి నిర్వహించనున్నారు. 1972లో ఆలయ జీర్ణోద్ధరణ చేసినప్పటికీ తర్వాత కాలంలో నిర్వహణ సరిగ్గా లేక ఆలయం శిథిలావస్థకు చేరింది.

400 ఏళ్ల చరిత్ర

ముస్తాబాద్, మద్దికుంట గ్రామాల మధ్య పురాతన శ్రీమెట్టు రాజరాజేశ్వరస్వామి ఆలయం పూర్తిగా శిథిలమైంది. 400 ఏళ్ల క్రితమే ఇక్కడ శివాలయాన్ని నిర్మించినట్లు అక్కడున్న శాసనాలు, ఆనవాళ్లు చెబుతున్నాయి. శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయాన్ని 1972లో చిటువేరు శివరాజయ్య, నర్సమ్మ దంపతులు అప్పట్లో బాగుచేశారు. ఆ దంపతుల మరణానంతరం ఆలయ నిర్వహణను పట్టించుకునే వారు లేక శిథిలావస్థకు చేరింది. ఆలయంలో దొంగలు తవ్వకాలు చేపట్టారు. ఇదిలా ఉండగా నాలుగేళ్ల క్రితం పోతుగల్‌కు చెందిన గోద అంజిబాబు రూ.30లక్షలు వెచ్చించి ఆలయ పునర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆలయ గోపురం, ప్రధాన మంటపం, ఆంజనేయస్వామి, దుర్గాదేవి మందిరాలను నిర్మించారు.

నేటి నుంచి ఉత్సవాలు..

ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు పునర్ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శ్రీమాధవానందసరస్వతీ, మధుసూదనానందస్వామి, మెట్టు రఘురామశర్మ, శాస్త్రుల మెట్టు రామశర్మ పర్యవేక్షణలో ఉత్సవాలు జరుపుతున్నారు. యంత్ర, విగ్రహ, ప్రాణప్రతిష్ఠలు మూడు రోజులపాటు అంగరంగ వైభంగా నిర్వహించనున్నారు.

సేవ చేయడం అదృష్టం



మెట్టు రాజరాజేశ్వర స్వామి ఆలయ జీర్ణోద్ధరణలో భాగస్వామ్యం కావడం నా అదృష్టం. పురాతన ఆలయాలను కాపాడుకోవాలి. భవిష్యత్ తరాలకు అందించాలన్న సంకల్పంతో సేవచేశాను. ప్రతిష్ఠాపన ఉత్సవాలకు ఏర్పాట్లు చేశాం.
– గోద అంజిబాబు

తమ్ముడిని హత్య చేశారని..

- మంథని సుమన్ హత్యలో కీలక పాత్రధారి ధనాల చంద్రశేఖర్
- 15 రోజుల ముందు నుంచే ప్రణాళిక
- జైలులో పరిచయమైన నేరస్తుడితో కలిసి ఘాతుకం
- ఏడుగురు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్



నిందితుల అరెస్ట్ చూపుతున్న డీసీపీ వైభవ్ గైక్వాడ్



స్వాధీనం చేసుకున్న కత్తులు

గోదావరిఖని(రామగుండం): తన తమ్ముడు ధనాల శివకుమార్ అలియాస్ చిన్న హత్యకు ప్రతీకారంగానే మంథని సుమన్‌ను ధనాల చంద్రశేఖర్ హతమార్చాడు. బుధవారం గోదావరిఖని వన్‌టౌన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్ వివరాలు వెల్లడించారు. ఘటనకు 15రోజుల ముందునుంచే స్కెచ్ చేసి పక్కా ప్రణాళిక ప్రకారం ప్రధాన నిందితుడు ధనాల చంద్రశేఖర్, వరంగల్ జైలులో అతడికి పరిచయమైన వేముల నవీన్ అలియాస్ బాబి కలిసి సుమన్‌ను హత్య చేసినట్లు పేర్కొన్నారు. దీనికి చంద్రశేఖర్ బంధువులు సహకరించారు. గోదావరిఖని లెనిన్‌నగర్‌లో నివాసముంటున్న చంద్రశేఖర్ ప్రస్తుతం విజయవాడలో ఉంటున్నాడు. ఇతడిపై గతంలో రౌడీషీట్‌తో పాటు పలు కేసులు ఉన్న క్రమంలో పీడీయాక్ట్ నమోదు చేసి 2019లో వరంగల్ జైలుకు పంపారు. తన తమ్ముడ్ని 2018లో హత్య చేసిన సుమన్‌ను ఏలాగైనా చంపాలనే నిర్ణయించుకున్నాడు. వరంగల్ జైలులో ఉన్న సమయంలో వేముల నవీన్ అలియాస్ బాబితో పరిచయమైంది. ఈక్రమంలో మంథని సుమన్ హత్యకు సహకరిస్తే హైదరాబాద్‌లో రెస్టారెంట్ పెట్టుకునేందుకు ఆర్థికసాయం చేస్తానని చెప్పడంతో బాబి ఒప్పుకున్నాడు.

అదనుచూసి ప్రధాన చౌరస్తాలోనే..

మంథని సుమన్‌ను హత్య చేసేందుకు హైదరాబాద్‌లో ఉంటున్న బాబి గత నెల 28న గోదావరిఖనికి బస్సులో వచ్చాడు. తర్వాత చంద్రశేఖర్, బాబి ఇద్దరూ ఆనంద్ ఇంట్లో బస చేశారు. గత నెల 29న రాత్రి 8.20 గంటల సమయంలో చంద్రశేఖర్, బాబి ప్రధాన చౌరస్తా వద్దకు వచ్చారు. అప్పుడే సుమన్ చాయ్ తాగి తన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు చేరుకుంటున్న క్రమంలో చంద్రశేఖర్, బాబి కత్తులతో విచక్షణరహితంగా దాడి చేసి చంపేశారు. అనంతరం బాబి రైలులో హైదరాబాద్ పారిపోయాడు.

ఏడుగురి అరెస్ట్

మంథని సుమన్ హత్య కేసులో ఏడుగురిని అరెస్ట్ చేశారు. గోదావరిఖని లెనిన్‌నగర్‌కు చెందిన ధనాల చంద్రశేఖర్, హైదరాబాద్ బేగంపేట్ ప్రకాశ్‌నగర్‌కు చెందిన వేముల నవీన్ అలియాస్ బాబి, ప్రధాన నిందితుడి బావ యైటింక్లయిన్‌కాలనీకి చెందిన మాడుగుల శ్రీనివాస్, చెల్లె మాడుగుల స్వరూప, బంధువులు గోదావరిఖని హనుమాన్‌నగర్‌కు చెందిన గంరేటి అజయ్‌కుమార్, గంరేటి శేషి, రామగుండం హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన బంగారి ఆనంద్‌ను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి మూడు కత్తులు, ఆటో, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచారు. ఈకేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్, సీఐలు రమేష్‌బాబు, ప్రసాద్‌రావు, ఇతర అధికారులు, సిబ్బందిని డీసీపీ అభినందించారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

ఇటీవల హత్యకు గురైన సుమన్, హత్య చేసిన చంద్రశేఖర్ ఇద్దరు రౌడీషీటర్లు కావడంతో.. ఇకముందు రౌడీషీటర్లపై పోలీసుల వైఖరి ఏలా ఉండబోతోందని అడిగిన ప్రశ్నకు డీసీపీ స్పందించారు. ఈవిషయంలో సీపీ సీరియస్‌గా ఉన్నారని, త్వరలో జిల్లా వ్యాప్తంగా ఉన్న రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫార్మసీ విద్యార్థి దుర్మరణం



ఘటన స్థలం వద్ద తీవ్రంగా గాయపడిన సాయిబాబా

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని రామకృష్ణకాలనీ పంచాయతీ పరిధి సుభాష్‌నగర్ వద్ద కేడీసీసీబీ బ్యాంకు ఎదుట రాజీవ్ రహదారిపై బుధవారం మధ్యాహం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫార్మసీ విద్యార్థి దుర్మరణం చెందాడు. ఎల్ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఓ ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీ రెండో సంవత్సరం చదువుతున్న పారిక సాయిబాబా(19) మధ్యాహ్నం కళాశాల అనంతరం బయటకు వచ్చాడు. తన బుల్లెట్ బైక్‌పై స్నేహితుల వద్దకు వెళ్లాడు. వారితో కాసేపు మాట్లాడిన అనంతరం రాజీవ్ రహదారి మీదుగా కరీంనగర్ బయల్దేరాడు. కేడీసీసీబీ బ్యాంకు ఎదుట ఆటో ఎదురుగా రావడంతో దానిని తప్పించే క్రమంలో కిందపడ్డాడు. ఎదురుగా వస్తున్న లారీ డ్రైవర్ అతివేగంగా నడిపి సాయిబాబాను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సాయిబాబా తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎల్ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడి తండ్రి గురుమిల్‌సింగ్ మండలంలోని నర్సింగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎల్ఎండీ ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని పురాణిపేటకు చెందిన ఇనుగుర్తి భూమయ్య(70) కాంతిభవన్ సమీపంలో ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతుండగా ట్రాక్టర్ ఢీకొని మృతిచెందాడు. పురాణిపేటకు చెందిన ఇనుగుర్తి భూమయ్య పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. కాంతిభవన్ సమీపంలో రోడ్డు దాటుతుండగా ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ భూమయ్య ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు శ్రీధర్ ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ కిశోర్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

బాలాజీ గోల్డ్ : మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును (స్పాట్ క్యాష్), తాకట్టు షిఫ్టింగ్ చేయబడును. 90320 40019. [T-1744]

CHANGE OF NAME

I, Sayapuraju Rameshwar Rao, Resident of Kothapalli(H) Town & Mandal, Karimnagar(D). hereby state that i am known by the both names: 1.Sayapuraju Rameshwar Rao 2. Chandurti Rameshwar Rao Moreover, Mr Ramu Chandurti is my legible son. Declared through this an affidavit dated: 30-01-2023 sworn before notary at Karimnagar. [K-1141946]

WANTED

Suitable B.Sc. Agriculture / Horticulture and Diploma in Agriculture / Horticulture (Rs. 16000/-+TA for Diploma and B.Sc. Agriculture/Horticulture 25,000/- + TA) in Oil Plam Project in Peddapally. Cont: 7893099906. [K- 1232835]

వరంగల్‌లోని చికెన్ సెంటర్‌లో పని చేయుటకు అనుభవం గల చికెన్ కట్టర్ కావలెను. జీతం 18000+రూం+ భోజనం ఫ్రీ. సంప్ర: 6281342090, 9949857816. [WA-6469]

మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190562]

ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-779876]

షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్, లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. ఫోన్ : 9391036931, 9246585901. [HA-10072]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824